క్లుప్తంగా

పుష్యమి కీర్తికి మహిళా సేవా వైభవ రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న పుష్యమి కీర్తి

పిఠాపురం: గొల్లప్రోలు ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పుష్యమి కీర్తికి మహిళా సేవా వైభవ రత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. సర్ సీవీ రామన్ అకాడమీ సేవ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆమె అకాడమీ ప్రధాన కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వరరావు తదితరుల చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సత్కారంతో తన బాధ్యత పెరిగిందని పుష్యమి కీర్తి అన్నారు.

కొత్త ఓటర్ల నమోదు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి కృష్ణమూర్తి

పిఠాపురం: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల ఇంటింటి సర్వే వచ్చే నెల 21 లోపు పూర్తి చేయాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, కొడా వైస్ చైర్మన్ పి.కృష్ణమూర్తి బీఎల్ఓలను ఆదేశించారు. మంగళవారం గొల్లప్రోలు ఎంపీడీఓ కార్యాలయంలో నగర పంచాయతీకి చెందిన బీఎల్ఓలతో, పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో పిఠాపురం రూరల్ టౌన్ బీఎల్ఓలతో, ఎంపీడీఓ కార్యాలయం, యు.కొత్తపల్లిలో కొత్తపల్లి బిఎల్ఓలతో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. బీఎల్ఓలు ప్రతి ఇంటినీ సర్వే చేసి జనవరి ఒకటి 2025 నాటిని 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా గుర్తించి నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో అస్పష్టంగా ఉన్న ఫొటోలను తొలగించి ఫారం 8 ద్వారా సరిచేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ బీఎల్ఓలు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



కుతుకుడుమిల్లిలో పంట పొలాలను పరిశీలిస్తున్న సమన్వయకర్త దయాకర్

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లి అంబయ్య పొలాన్ని మంగళవారం పెద్దాపురానికి చెందిన ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఏరువాక సమన్వయకర్త ఎస్.దయాకర్ పరిశీలించారు. పొలంలో పండిస్తున్న బీపీటీ 2858 రకం, చిరుసంచుల క్షేత్రాన్ని కూడా సందర్శించారు. ఈ రకం మొక్క గుణగణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ రకం ముఖ్యంగా సేంద్రీయ పద్ధతుల సాగుకు అనుకూలమైనదని వారు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాల ద్వారా పంటసాగు చేసుకోవాలని సూచించారు. పంటకు అధికంగా ఎరువులను వినియోగించకూడదన్నారు. ఆయన వెంట వీఏఏ శివ తదితరులు ఉన్నారు.

బంద్‌కు సహకరించాలి

సామర్లకోట: భారత్ బంద్‌లో భాగంగా బుధవారం బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరిం చాలని మాల మహానాడు జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సుప్రీమ్ కోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా బంద్ జరుగుతోందన్నారు. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, హోటళ్లు, పెట్రోలు బంకులు, కిరణా వర్తకులు బంద్‌కు సహకరించాలని జేఏసీ నాయకులు నేతల హరిబాబు, వారా సుధాకర్, బీపెల్లి అశోక్, మైలాబత్తుల జానీ మోజెస్ పిలుపు నిచ్చారు.

పైపులైన్ గోతులు పూడ్చారు



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో గోతిని పూడుస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కొత్తపల్లి: పిఠాపురం - ఉప్పాడ రోడ్డులో తాగునీటి పథకానికి సంబంధించి ప్రమాదకరంగా ఉన్న పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన గోతులను ఎట్టకేలకు పూడ్చారు. సాక్షి దిన పత్రికలో సోమవారం 'తవ్వారు.. వదిలేశారు..' శీర్షికన ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టి ఎండపల్లి జంక్షన్ సమీపంలో సంగం పూడ్చిన గోతిని పూర్తిగా పూడ్చారు.

లాభాల బాట

- కాలిబాటతో వరిలో చీడపీడలు దూరం
- ఎరువులు, మందుల పిచికారీకి అనుకూలం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు
- నియోజకవర్గంలో 12 వేల హెక్టార్లలో వరి సాగు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కొత్తపల్లి: మండలంలో ఇప్పటికే 90 శాతం నాట్లు వేశారు. నియోజకవర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలులో సుమారు 12 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. కొత్తపల్లి మండలంలో సుమరు 6150 మంది రైతులు 10154 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. వరినాట్లు వేసిన రైతులు పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే రైతులకు మేలు జరగడంతో పాటు చీడపీడలను సులభంగా తట్టుకోవచ్చని మండల వ్యవసాయ సిబ్బంది రైతులకు సూచిస్తున్నారు. దీంతో పాటు కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.



కాలిబాటల వల్ల లాభాలు

- వరిలో కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు చాలా మేలు జరగనుంది.
- వరిపంటను సాగు చేసిన రైతులు తూర్పు, పరమర దిశగా ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాటను ఏర్పాటు చేసుకోవాలి.
- మొక్కలకు గాలి, వేలుతురు బాగా అంది చీడ పీడలు రాకుండా ఉంటాయి.
- పురుగు నివారణ, మందుల పిచికారీకి సులభంగా ఉంటుంది. ప్రతి మొక్కపైన మందు సులభంగా పండేందుకు వీలు ఉంటుంది.
- వరిమడిలో భూమి తడి లేకుండా సులభంగా అరబెట్టేందుకు వీలవుతుంది.
- వరికోత సమయంలో సులభంగా కోతలు కోసుకునేందుకు వీలుంటుంది.

మొక్కలు ఏపుగా పెరుగుతాయి



వరిలో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. మొక్కకు కావలసిన గాలి వెలుతురు బాగా తగులుతుంది. దీంతో దుబ్బు బాగా కట్టి మొక్కల సంఖ్య పెరుగుతుంది. రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగుపై సలహాలను అందిస్తున్నాం. ఏ సమయంలో ఎంత మోతాదులో మందులను ఉపయోగించాలో తెలియజేస్తున్నాం.

– జోగిరాజు, మండల వ్యవసాయ అధికారి, కొత్తపల్లి

బాట ఏర్పాటు చేస్తున్నాం



నేను చాటా కాలం నుంచి ఏటా వరిపంటను సాగు చేస్తున్నాను. వరిమడిలో క్రమం తప్పకుండా కాలి బాటను ఏర్పాటు చేసుకుంటున్నాను. దీనిపై సులభంగా ఎరువులు, మందులు పిచికారీ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. మొక్కకు తగినంత గాలివెలుతురు తగలడం వల్ల ఏపుగా పెరుగుతుంది.

– కాకడ అప్పారావు, రైతు, పాత ఇసుకపల్లి

అవగాహన కల్పిస్తున్నారు



కాలి బాటలను ఏర్పాటు చేసుకోవడంవల్ల కలిగే లాభాల గురించి రైతులకు తెలియజేస్తున్నం. దీంతో దాదాపు అందరూ రైతులు కాలిబాటలను ఏర్పాటు చేసుకుంటూరు. బెంగాలీ కూలీలు వరి నాట్లు వేసే సమయంలోనే బాటలు వేస్తున్నారు. వరి పంటపై పాటించాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు తెలియపరుస్తున్నాం.

– గౌతం, గ్రామ వ్యవసాయ సహాయకుడు, ఇసుకపల్లి

శాంతివర్ధన నిర్వహణ భేష్



శాంతివర్ధనలో వసతులపై ఆరా తీస్తున్న ప్రత్యేకాధికారి, తహసీల్దార్

పెద్దాపురం: మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని మండల ప్రత్యేకాధికారి, కో-ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ మురళికుమార్, తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉష అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని ఈ వసతి గృహం తీరు తెన్నులను అధికారుల బృందం పరిశీలించి సేవలు, పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ తనిఖీలో సంస్థ డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ప్రిన్సిపాల్ సత్య, ఏఓ వేణుతో పాటు సిబ్బంది ఉన్నారు.

ఒకేషనల్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ (మహిళ) ఒకేషనల్ కోర్సు బోధించడానికి గెస్టు ఫ్యాకల్టీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీదేవి మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, నర్సింగ్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేయాలన్నారు. ఈనెల 21 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో నేరుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాజరు కావాలన్నారు. 22వ తేదీ ఉదయం 11 గంటలకు డెమో, ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు.

కాయ తొలిచే పురుగుతో అప్రమత్తం

ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ దయాకర్, డాక్టర్ శర్మ

పిఠాపురం: ప్రత్తి పంటపై గులాబీ రంగు కాయ తొలిచే పురుగు వ్యాపిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ దయాకర్, డాక్టర్ శర్మ సూచింస్తున్నారు. గొల్లప్రోలు మండలంలో తాటిపర్తి, వన్నెపూడి చెందుర్తి దుర్గాడ గ్రామాల్లో వేసిన ప్రత్తి పంటపై ఈ పురుగుతో పాటు, రసం పీల్చే పురుగుల ఉనికి కనిపించడంతో మంగళవారం ఆయా గ్రామాల్లో పత్తి పంటను వారు పరిశీలించి సస్యరక్షణా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమానికి పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, ఎంఏఓ కేవీవీ సత్యనారాయణ, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగులు నివారణకు

- ప్లోనికామిడ్-0.6 గ్రాములు, లేదా థయామిథోక్సం - 0.2 గ్రాములు లేదా మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేయాలి.
- గులాబి రంగు కాయ తొలుచు పురుగు నివారణకు
- ఎకరానికి ప్రొఫెనోఫాస్ 400 మిల్లీ లీటర్లు, లేదా క్లోర్ పైరిఫాస్ 500 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



పురుగు సోకిన పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా ఘటనకు నిరసనగా మానవహారం నిర్వహిస్తున్న వీరాంజనేయులు, విద్యార్థులు

పెద్దాపురం: దేశంలో యువతులు, విద్యార్థినులపై అత్యాచారాలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ కృష్ణుడి గుడి వద్ద మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో కలిసి కోల్‌కతా మెడికల్ విద్యార్థినిపై అత్యాచార ఘటనకు నిరసనగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నిరసన తెపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేకేఎం కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

23న ఉపాధి హామీ గ్రామ సభలు

సామర్లకోట: గ్రామాల్లో ప్రజలు, రైతులకు అవసరమైన పనులను గుర్తించడానికి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి చేపట్టనున్న పనులకు ఈ సభల్లో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. 23వ తేదీన అచ్చంపేట, గొంచాల, నవర, చంద్రంపాలెం, పవర, పంద్రవాడ, పనసపాడు, మాధవట్నం, వీకే రాయపురం, బోయనపూడి, ఉండూరు, పి.వేమవరం, కాపవరం, హుస్సేన్‌పురం, వేట్లపాలెం, జి.మేడపాడు, జి.కొత్తూరు, పీబీ దేవం గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు జరుగుతాయని ఆమె వివరించారు. ఈ మేరకు ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలకు తెలిసే విధంగా దండోరా వేయాలన్నారు. ఈ గ్రామ సభలకు ఉపాధి హామీ మేట్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు హాజరయ్యేలా చూడాలన్నారు.

ప్రతి విద్యార్థీ సంస్కార విద్యను అభ్యసించాలి

విశ్వ మానవతా సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌చౌదరి

పెద్దాపురం: ప్రతీ విద్యార్థీ సంస్కార విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విశ్వ మానవతా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అల్లూరి శ్రీనివాస్ చౌదరి అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో మంగళవారం విద్యార్థి జీవన వికాస మార్గదర్శిని అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ ప్రశ్నించి తెలుసుకోవడం, పరిశీలించి నేర్చుకోవడం, ఆలోచించి అభ్యసించడం వంటి విషయాలను అలవర్చుకునే విద్యార్థి ఉన్నత లక్ష్యాలను చేరుకుంటాడన్నారు. యోగాభ్యాసము, సూర్య నమస్కారాలు, ఆసనాలు, ధ్యానం తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ రైతు కుటుంబంలో పుట్టి ఉన్న విద్యనభ్యసించి సాఫ్ట్‌వేర్ వ్యవస్థను స్థాపించి ఉన్నత లక్ష్యాలను సాధించిన మానవతా సంస్థ చైర్మన్ శ్రీనివాస్ చౌదరి సేవలను కొనియాడారు. 18 దేశాల్లో 30 వేల కిలో మీటర్ల సైకిల్ యాత్ర చేసి యువతకు ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. 60 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ 300 గ్రామాల్లో ఉచిత విద్య స్టడీ సెంటర్లు నడుపుతున్న ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యాలయ తరపున శ్రీనివాస్ చౌదరిని సత్కరించారు. ఈ సందర్భంగా యోగా క్యాలెండర్లు, విద్యార్థి విజయానికి రాజపథం అనే పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పెమ్మాడి వీరభద్రవర్మ, మౌనికతో పాటు విద్యాలయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన శ్రీనివాస్ చౌదరి

దోమలు లేని సమాజమే లక్ష్యం



పిఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



చెరువులోకి గంబూషియా చేప పిల్లలను వదులుతున్న కమిషనర్ పద్మావతి

పిఠాపురం: దోమల రహిత సమాజమే లక్ష్యమని, అందుకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని డాక్టర్ జయరాం అన్నారు. మంగళవారం పిఠాపురంలోని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రపంచ దోమల దినోత్సవాన్ని ఈ సందర్భంగా దోమల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించి, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు, టైఫాయిడ్, బోదవ్యాధి వంటి ప్రాణాంతక రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ ఆర్.చిన్నారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు చెరువులలో దోమ లార్వాను నశింపజేసే గంబూషియా చేపలను వదిలారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రమణ మూర్తి రత్న కుమారి, బేబీ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

పెద్దాపురం: పట్టణంలో పెరుగుతున్న విష జ్వరాల నేపథ్యంలో దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. స్థానిక గుర్రాల సెంటర్ పార్కు, మరిడమ్మ గుడి వద్ద మనోజ్ చెరువు తదితర ప్రాంతంలోని చెరువుల్లో మంగళవారం గంబూషియా చేప పిల్లలను ఆమె చెరువుల్లోకి వదిలారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన మంచి నీటిని మాత్రమే తాగాలన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. అనంతరం ఆయా చెరువులు, మేజర్ డ్రెయిన్లలో గంబూషియా చేప పిల్లలను మున్సిపల్ ఎస్ఐ దావీదురాజు కలిసి కమిషనర్ పద్మావతి చెరువుల్లోకి వదిలారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెద్దాపురం: ప్రతి విద్యార్థీ నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఏటీసీ సెంటర్‌లో మంగళవారం జాతీయ సైటింఫిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీసీసీ, ఏటీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గోవింద పనసరే వర్ధంతి సందర్భంగా సైంటిఫిక్ టెంపర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీసీ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ సైంటిఫిక్ టెంపర్, సైంటిఫిక్ మెథడ్, సైంటిఫిక్ ఫర్సెక్షన్, సైంటిఫిక్ హ్యాబిట్; సైంటిఫిక లిటరసీ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీవితంలో ప్రతి వ్యక్తికీ నమ్మకానికి, మూఢ నమ్మకానికి చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. మనం చేసే ప్రతి పనిలో సైన్స్ ముడిపడి ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవీంద్ర, పీసీసీ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వసతి, సంరక్షణ గృహాల తనిఖీ

- అనకాపల్లి జిల్లా ఘటనపై స్పందించిన కలెక్టర్
- ఆయన ఆదేశాలతో వసతిగృహాలను పరిశీలించిన కమిషనర్, ఐసీడీఎస్ పీడీ తదితర అధికారులు
- విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా



నగరంలోని వివిధ హాస్టళ్లను తనిఖీ చేస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: నగరంలోని పలు వసతి, సంరక్షణ గృహాలను మంగళవారం రాత్రి నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణ పరిస్థితులు కల్పించాలన్నారు. ఇటీవల అనకాపల్లి జిల్లా కోటవురట్లలోని ఓ వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ జరిగి చిన్నారులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు తహసీల్దార్, పోలీసు, శిశు సంక్షేమశాఖ అధికారులు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల సంరక్షణ గృహాలు, వసతి గృహాలు, ఆశ్రమాల్లో పరిస్థితులపై తనిఖీ చేస్తున్నారు. దీనిలో భాగంగా కమిషనర్ భావన, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ తదితరులు నగరంలోని పలు వసతి గృహాలను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థుల సంఖ్య, వారికి సరైన వసతులు ఉన్నాయా?లేదా? వారు తినే ఆహారం ఎలా ఉంటోంది? ఆరోగ్యకరమైన వాతావరణం ఉందా? వంటి విషయాలను స్వయంగా పరిశీలించారు. భోజనం బాగుంటుందా? అంటూ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా కమిషనర్ కలెక్టరేట్ వెనుక ఉన్న ఓ వసతి గృహాన్ని పరిశీలించారు. అక్కడ విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీబీఎం కాలేజీ రోడ్డులోని కల్వరి సందేశ్ వసతి గృహాన్ని, భాస్కర్ నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న పరివర్తన వసతి గృహాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు.

చురుగ్గా మేజర్ డ్రైను పూడిక తీత

సామర్లకోట: స్థానిక 25వార్డులోని అయోధ్యరామపురం ముంపునకు కారణమైన మేజర్ డ్రైను పనులను మంగళవారం ప్రారంభించారు. కొద్దిపాటి వర్షాలకే బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ నుంచి మఠంసెంటర్ వరకు ఉన్న రోడ్డు చెరువుగా మారుతున్న విషయం తెలిసిందే. స్థానికుల డిమాండ్ మేరకు పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో డ్రైన్లలో పూడికతీతకు రూ.36 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఇందుకు అనుమతి లభించడంతో పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. పూడిగ తీసిన వెంటనే దానిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఈ సాగర్‌ను ఆయన ఆదేశించారు. ఈ పనులకు కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, రైతు సంఘ నాయకుడు కంటే బాబు తదితరులు పాల్గొన్నారు.



డ్రైను పనులను పరిశీలించిన కమిషనర్ తదితరులు

గ్రామాల విలీనానికి పోస్టుకార్డు ఉద్యమం



టీచర్స్ కాలనీలో పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టిన నాయకులు

కాకినాడ రూరల్: కాకినాడ కార్పొరేషన్‌లో రూరల్ మండల గ్రామాలు రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, చీడిగ, తూరంగిలను విలీనం చేయాలని కోరుతూ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్టు పౌర సేవా సంఘం కన్వీనర్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేట పంచాయతీలోని రాయుడుపాలెం టీచర్స్ కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. రమణయ్యపేట తదితర గ్రామాలను కార్పొరేషన్ విలీనం చేసి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు పోస్టు కార్డులు పంపుతున్నట్టు తెలిపారు. టీచర్స్ కాలనీలో డీఎస్ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమావేశంలో పోస్టు కార్డులు పంపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో అంబటి రామకృష్ణ, కొత్తపల్లి నూకరాజు, ఇబ్రహీం యువరాజు పాల్గొన్నారు.

ఐడియల్ కళాశాలకు బెస్ట్ అప్రిషియేషన్ పురస్కారం



ఉన్నత విద్యామండలి చైర్మన్ రామ్మోహనరావు నుంచి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్

బాలాజీచెరువు: ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూకే బెస్ట్ అప్రిషియేషన్ అవార్డు అందజేశారు. జేఎన్‌టీయూ కాకినాడలో మంగళవారం నిర్వహించిన 16వ వ్యవస్థాపక దినోత్సవాల్లో కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్‌కు ఉన్నత విద్యామండలి చైర్మన్ రామ్మోహనరావు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, కార్యదర్శి పి.చిరంజీవినికుమారి, డైరెక్టర్ కృష్ణంరాజు, ఏవో జీవీకే వర్మ అభినందనలు తెలిపారు.

లైంగిక వ్యాధులపై అవగాహన కోసం రెడ్ రన్

కాకినాడ క్రైం: లైంగిక వ్యాధులపై అవగాహన కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మారథాన్ 5కె రెడ్ రన్ నిర్వహించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వద్ద డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అక్షర స్కూల్ జంక్షన్ వరకు కొనసాగిన ఈ రెడ్ రన్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో పాటు ఇతర లైంగిక సంక్రమణ వ్యాధులు, పునరుత్పత్తి భాగాల వ్యాధులపై అవగాహన కోసం మారథాన్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. అనంతరం ఇవే అంశాలపై కొద్ది రోజుల క్రితం కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు అవార్డులు, రివార్డులు అందజేశారు.